క్లుప్తంగా

హాకీ క్రీడాకారిణుల ఎంపిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మినీస్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సంగీతరావు ఆధ్వర్యంలో 67వ ఎస్‌జీఎఫ్ నిజామాబాద్ జిల్లా అండర్–17హాకీ క్రీడాకారిణుల ఎంపికను నిర్వహించారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు టీ విద్యాసాగర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి సురేందర్, బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాల్కొండ: ముప్కాల్ మండలంలోని రెంజర్ల, నాగంపేట్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను మోడల్ కోడ్ కండక్ట్ అధికారులు బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు, వికలాంగులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

పంటరుణాల చెక్కులు పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల సహకార సంఘంలో పది మంది రైతులకు పంట రుణాలు మంజూరయ్యాయి. రుణాల చెక్కులను చైర్మన్ గంగాధర్ బుధవారం పంపిణీ చేశారు. రైతులు పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఈవో గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

మోసం చేసిన పార్టీలను ఓడించాలి

ఆర్మూర్‌టౌన్: విద్యా, ఉపాధిరంగాన్ని నిర్లక్ష్యం చేసి మోసం చేసిన బీఆర్‌ఎస్, బీజేపీలను ఎన్నికల్లో ఓడించాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్, వెంకటేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో స్టూడెంట్ యూత్ మేనిఫెస్టోను పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు బుధవారం విడుదల చేశారు. విద్య, వైద్యం ఉపాధి కీలకమైనవైనప్పటికీ.. పదేళ్లకాలంలో బీఆర్‌ఎస్, బీజేపీలు ఈ రంగాలను గాలికి వదిలేశాయని విమర్శించారు.

విశ్వరూప సభను విజయవంతం చేయాలి



బోధన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 11న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టిన విశ్వరూప మహాసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

వర్ని (మోస్రా) : మండలంలోని గోవూర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల కమిటీ చైర్మన్ నన్నేసాబ్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. హెచ్ఎం నాగనాథ్, శ్రీపాద్, రాజకళ, విజయలక్ష్మి, వాసవి, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ డిపాజిట్లను తగ్గించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్స్ డిపాజిట్లను ఒకేసారి పెంచడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతారని, వెంటనే వాటిని తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విగ్నేష్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో తెయూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న విధంగానే హాస్టల్స్ ఫీజులు వసూలు చేయాలని, డిపాజిట్ పెంపు విషయంలో పునరాలోచించాలని కోరారు. ఈ విషయాన్ని వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ల దృష్టికి తీసుకెళ్తానని చీఫ్ వార్డెన్ హామీ ఇచ్చారు.

సీఎం కేసీఆర్ దళిత పక్షపాతి

- బీఆర్‌ఎస్ హయాంలో దళితులకు స్వర్ణయుగం
- అంబేడ్కర్ స్ఫూర్తితోనే తెలంగాణ సర్కారు పాలన
- దళితబంధు ప్రపంచంలోనే అద్భుతమైన పథకం
- ఆత్మగౌరవం ఉట్టిపడేలా కమ్యూనిటీ హాళ్లు
- దళిత కుటుంబాల ఆత్మీయసమ్మేళనంలో జీవన్‌రెడ్డి



హాజరైన దళితులు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నందిపేట్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన దళితులకు స్వర్ణయుగమని ఆ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట్‌లోని జీవనన్న ఎస్సీ ఫంక్షన్‌హాల్‌లో దళిత కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి జీవన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి రజితరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ దళిత పక్షపాతి అని, అంబేడ్కర్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ పాలన సాగుతున్నదన్నారు. రాష్ట్రంలో మాల, మాదిగల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో దళితుల అభివృద్ధికి చేసిన ఖర్చు కేవలం రూ.16 వేల కోట్లు కాగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది బడ్జెట్‌ను కలుపుకుని పదేండ్లలో రూ.లక్షా 25వేల 68 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వివరాలు ప్రభుత్వ పోర్టల్‌లో ఉన్నాయని తెలిపారు. దళితుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న దళితబంధు పథకం ప్రపంచంలోనే అద్భుత పథకమన్నారు. రూ.10లక్షలు పొందిన దళితులు ఆర్థికంగా స్థిరపడటంతో వారి జీవితాల్లో గణనీయమైన మార్పు సాధించారన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 50 వేల మందికి దళితబంధు అందినట్లు తెలిపారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టుకున్నామని, ఆ మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కిందన్నారు. డాక్టర్ అంబేడ్కర్ విద్యానిధి పథకం, దళితవాడలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు, ప్రీ మెట్రిక్ ఆర్థిక సాయం, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్, ఎస్సీ హాస్టళ్లు, స్వయం ఉపాధికి ఆర్థిక ప్రోత్సాహం, ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇలా.. దళితుల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి పథకం దళిత సోదరుల జీవితాల్లో వెలుగులు నింపేవేనని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. నందిపేట్‌తో పాటు పెర్కిట్ రోడ్డు, మాక్లూర్‌లో దళితుల కోసం ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ దళితులు తన ఆత్మబంధువులని అన్నారు. తనకు ఏ రాజకీయ నేపథ్యం లేకపోయినా దళితుల అభిమానంతో రెండుసార్లు గెలిచానని, మరోసారి తనను దీవించాలని ఆయన కోరారు. జీవన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి రజితరెడ్డిని దళితకుటుంబాల ప్రతినిధులు గజమాలతో సన్మానించారు.

వైద్య సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి?

- మండల సమావేశంలో ఆరుగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల ఆవేదన



సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ అనిల్ పటేల్

రుద్రూర్: పొతంగల్ పీహెచ్‌సీ వైద్యుడు ఒక్కసారి కూడా మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదని, వైద్య సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని రాయకూర్, సిద్దాపూర్, చిక్కడపల్లి, రాణంపల్లి, రాయకూర్‌క్యాంప్, సులేమాన్‌నగర్ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆరు గ్రామాలను పొతంగల్ పీహెచ్‌సీ పరిధి నుంచి తొలగించి రుద్రూర్ పీహెచ్‌సీలో కలపాలని డిమాండ్ చేశారు. రుద్రూర్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అక్కపల్లి సుజాతానాగేందర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్రామాల ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రుద్రూర్ మండలంలో ఉన్న తమ గ్రామాలకు పొతంగల్ మండల పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బంది వస్తున్నారని, అతి సమీపంలో ఉన్న రుద్రూర్‌ను కాదని పది కిలో మీటర్ల దూరంలో ఉన్న పొతంగల్ పీహెచ్‌సీలో కొనసాగించడం ఏమిటని వారు ప్రశ్నించారు. రాయకూర్ శివారులోని సాగర్ కాలువ 28/5 కాలువ మరమ్మతులు చేయాలని సర్పంచ్ గంగారాం కోరారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అధికారులను కోరారు. ఈజీఎస్ బిల్లులు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ కోరారు. జడ్పీటీసీ నరోజి గంగారాం, ఎంపీడీవో బాల గంగాధర్, తహసీల్దార్ వెంకటేశం, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సుదర్శన్‌రెడ్డి పూజలు



నామినేషన్ పత్రాలను ఆలయ పూజారికి అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట్ శివారులోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన నామినేషన్ పత్రాలను స్వామి వారి ముందుంచారు. అనతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కుర్నాపల్లి, ఠానాకలాన్, జానకంపేట్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, సుదర్శన్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎడపల్లి సింగిల్ విండో వైస్ చైర్మన్ గాంధారి అనిల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే షకీల్ భూ ఆక్రమణలకు పాల్పడుతూ అక్రమ దందాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఇసుక దందా చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు ఓటుతో గుణపాఠం చెబుతారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, నాయకులు బిల్లా రామ్మోహన్, లింగం, జహీర్, సాయికుమార్, విజయ్‌గౌడ్, అయిటి సాయారెడ్డి, పరిగె సాయిలు, సంతోష్ రెడ్డి, ఏజాస్, ఖాజా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసే అవకాశమివ్వండి



మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

భీమ్‌గల్ : తనను ఎమ్మెల్యేగా గెలిపించి మీకు సేవ చేసుకునే అవకాశాన్ని ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలను కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ కోరారు. మండలంలోని పురాణీపేట్, బెజ్జోరా, చేంగల్ గ్రామాల్లో సునీల్ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభివృద్ధి పనులకు ఒకే కాంట్రాక్టర్‌ను పెట్టుకొని నియోజకవర్గ ప్రజలను దోపిడీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, పంట పెట్టుబడి సాయంగా ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు, భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు అందిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.2500 జమ చేస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు



కొత్తపల్లి యువకులకు కండువాలు కప్పుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి (రుద్రూర్) : కోటగిరి మండలం కొత్తపల్లికి చెందిన 20 మంది యువకులు బుధవారం బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోకు ఆకర్షితులై పలువురు బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

కోటగిరి మండల కేంద్రంలో పోచారం సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి కోటగిరి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో విండో చైర్మన్ కూచి సిద్దు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హమీద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొర్రెలకు పీపీఆర్ టీకాలు



నందిగామలో టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

నవీపేట : మండలంలోని నందిగామలో గొర్రెలు, మేకలకు పశువైద్యాధికారులు రతన్, నరేందర్‌రెడ్డి బుధవారం పీపీఆర్ టీకాలు వేశారు. ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలకు పారుదురోగం వచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ముందుజాగ్రత్తగా జీవాలకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

బోధన్: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన తమకు ఎలాంటి ఆదాయం లేక, పింఛన్ రాకపోవడంతో కష్టాల్లో ఉన్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని బోధన్ డిపో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు కోరారు. పట్టణంలోని మహాలక్ష్మి మందిరం కళ్యాణ మండపం వద్ద బుధవారం విశ్రాంత ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఆర్టీసీలోని ఎస్ఆర్‌బీసీ నిబంధనలను సవరించి నెలకు కనీసం రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేయడంతోపాటు ఆసరా పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సూపర్ లగ్జరీల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఎస్ఎస్‌బీ రావు, రాము, అన్వర్ పాల్గొన్నారు.

నాయకుల విస్తృత ప్రచారం



బోధన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా



సాలూరలో కాంగ్రెస్ ర్యాలీ

బోధన్/బోధన్ టౌన్/బాల్కొండ/వర్ని : బోధన్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు వేయాలని కోరుతున్నారు. బోధన్ పట్టణంలోని 24వ వార్డులో ఎమ్మెల్యే షకీల్ సతీమణి, అయేషా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అయేషా ఫాతిమా ప్రచారం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అందుబాటులో ఉండే షకీల్‌ను మూడోసారి గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ సుధారాణి, దూష్‌సింగ్, పట్టణ అధ్యక్షులు రవీందర్‌యాదవ్, నాయకులు శేఖర్, అబ్బగోని గంగాధర్, రవిశంకర్ గౌడ్ వార్డు వాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఆరు గ్యారెంటీలు అమలవుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యులు అల్లె లావణ్య రమేశ్, ఇల్తెపు శారద, టీపీసీసీ డెలిగెట్ గంగశంకర్, పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావుతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ ప్రారంభించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు అల్లె రమేశ్, తూము శరత్‌రెడ్డి, దొడ్ల రవీందర్‌రెడ్డి, టింకల్ హన్మంత్‌రావు పటేల్, రాహుల్ లక్ష్మణ్, ఇల్తెపు రమేశ్, కన్నె అశోక్, లోకప్పగారి లక్ష్మణ్ పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా వర్నిలో నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గిరి, కార్యదర్శి గోపాల్, నాయకులు నగేశ్, శ్రీహరి, సునీల్, అశోక్, దాస్, శ్రీను పాల్గొన్నారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కు మద్దతుగా కిసాన్‌నగర్‌లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

భారీ వర్షం



ఎడపల్లి (బోధన్) : అకాల వర్షం కారణంగా గ్రామాల్లో ధాన్యం తడిసింది. బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాల ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. అకాలవర్షం తమ పాలిట శాపమై వెంటాడుతున్నదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు సమయంలో ఎంత తరుగు తీస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో చేరికలు



వేల్పూర్/పెర్కిట్(ఆర్మూర్)/బాల్కొండ: రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం వేల్పూర్, భీమ్‌గల్, మోర్తాడ్ మండలాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్ కాలనీ వీరభద్ర సంఘం సభ్యులు జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ముప్కాల్ మండలం వేంపల్లి సహకార సంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్, బాల్కొండ మండలం బోదేపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఏం చేశారని ఓట్లడుగుతున్నారు

కాంగ్రెస్‌ను ప్రశ్నించిన వేముల ప్రశాంత్‌రెడ్డి



ఇనాయత్‌నగర్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ వాళ్లు తమ 60 ఏళ్ల పాలనలో ఏం చేశారని ఓట్లడుగుతున్నారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని అమీర్‌నగర్, ఇనాయత్‌నగర్, నర్సాపూర్ గ్రామాల్లో ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమకంటే ముందు పాలించిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు గిరిజనులకు పోడుపట్టాలు ఎందుకు ఇవ్వలేకపోయాయని అన్నారు. రైతులకు పంట పెట్టుబడి సాయం, పేదలకు ఆసరా పింఛన్లు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి తదితర మానవీయ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రుణమాఫీ ఆగే ప్రసక్తే లేదన్నారు. రూ.19వేల కోట్లకుగాను రూ.13వేల కోట్ల రుణమాఫీ పూర్తయ్యిందని, మరో రూ.6 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే మిగిలిందని తెలిపారు. ఆరు వేల కోట్ల రుణమాఫీ కూడా అమలు జరిగి తీరుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడగానే మేనిఫెస్టోలోని హామీలను అమలు చేస్తామన్నారు. పింఛన్లు, రైతుబంధును పెంచి ఇవ్వకపోతే మళ్లీ ఎన్నికల నాటికి తనను గ్రామాల్లోకి రానియొద్దన్నారు. కాంగ్రెస్‌లాగా కేసీఆర్ అడ్డగోలు హామీలు ఇవ్వబోరని, చెప్పిందే చేస్తారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఎడాపెడా అడ్డగోలు హామీలు ఇచ్చి బోర్లా పడిందని ఎద్దేవా చేశారు. అక్కడి రైతులకు పది గంటల కరెంటు ఇస్తామని, ఐదు గంటలు కూడా ఇవ్వకపోవడంతో ఆందోళనలు చేస్తున్నారన్నారు. ఇనాయత్‌నగర్, అమీర్‌నగర్ మధ్య గట్టు పొడిచిన వాగు కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి గత కాంగ్రెస్ పాలకులు నిధులు ఎందుకు మంజూరు చేయించలేకపోయారని ప్రశ్నించారు. చివరకు తనతోనే బ్రిడ్జి మంజూరైందని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ పోచంపాడ్ నీళ్లు అందించింది తామేనని పేర్కొన్నారు. న్యాయం, ధర్మం పక్షానే ఉండాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు కర్ణాటక, మహారాష్ట్రలకు వెళ్లి ఇక్కడి తరహా పథకాలు ఆ రాష్ట్రాల్లో ఉన్నాయో.. లేదో చూసి రావాలని కోరారు. కారు ఖర్చులు, దారి ఖర్చులను తానే భరిస్తానన్నారు. చూసి వచ్చాక గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద వాస్తవాలు చెప్పాలన్నారు. నాయకులు భాస్కర్ యాదవ్, రేగుంట దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న నామినేషన్లు



బోధన్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న శివసేన అభ్యర్థి గోపికిషన్



ఆర్మూర్‌లో స్వతంత్ర అభ్యర్థి రాజేశ్..

బోధన్/ఆర్మూర్/భీమ్‌గల్ : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. బోధన్‌లో బుధవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. పసులోటి గోపికిషన్(శివసేన), పానుగంటి రజితవాణి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), మోసిన్ (ఎంసీపీఐ-యూ), ఎండీ యూసుఫ్ (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేయగా, బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి మూడో సెట్, స్వతంత్ర అభ్యర్థి అస్గర్ రెండోసెట్ నామినేషన్ వేశారు. ఆర్వో రాజాగౌడ్‌కు నామినేషన్‌పత్రాలను అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో ఐదో రోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ వినోద్‌కుమార్ తెలిపారు. పైడి రాకేశ్‌రెడ్డి (బీజేపీ), రాజేశ్ (స్వతంత్ర) అభ్యర్థిగా రాజేశ్ నామినేషన్ పత్రాలను సమర్పించారన్నారు. దీంతో ఆర్మూర్ పరిధిలో మొత్తం ఎనిమిది నామినేషన్లు దాఖలు అయ్యాయని వివరించారు. బాల్కొండ నియోజకవర్గానికి ఏలేటి అన్నపూర్ణమ్మ(బీజేపీ), పల్లికొండ నర్సయ్య(బీఎస్పీ) నామినేషన్లు దాఖలు చేశారు.



భీమ్‌గల్‌లో నామినేషన్ వేస్తున్న బీఎస్పీ అభ్యర్థి నర్సయ్య



బోధన్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న పిరమిడ్‌పార్టీ అభ్యర్థి రజిత

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

బోధన్: గత ఎన్నికల సమయంలో తాను అమ్ముడుపోయాయని దుష్ప్రచారం చేశారని, ఇప్పుడూ అదే చేస్తున్నారని శివసేన అభ్యర్థి పసులోటి గోపికిషన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీమహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సొంత కారును అమ్ముకున్నానని, 20రోజులపాటు జైలుకు వెళ్లానన్నారు. నిజాంషుగర్స్ సమస్య పై 119 కిలో మీటర్ల పాదయాత్ర చేశానని, 20 ఏళ్లుగా హిందు ధర్మరక్షణకు పాటుపడుతున్నానన్నారు. బీసీ బిడ్డనైన తాను లోకల్ లీడర్‌నని, తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింకారి శివాజీ, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎనుగంటి గౌతంగౌడ్, బండారుపల్లి కిరణ్, నాయకులు రాహుల్, ప్రీతం, భూమన్న, లోకేశ్, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1	ఘోస్ట్- 10.15, టైగర్ నాగేశ్వరరావు - 01.10, నరకాసుర (తెలుగు) - 04.35, ఘోస్ట్- 7.35, భగవంత్ కేసరి (తెలుగు) - 10.30
స్క్రీన్-2	మా ఊరి పొలిమేర-2 (తెలుగు) - 10.25, 1.15, 7.30, 10.20; లియో (తెలుగు) - 4.05
స్క్రీన్-3	కీడాకోలా - 11.20, 2.00,4.40,7.20, 10.00
స్క్రీన్-4	భగవంత్‌కేసరి(తెలుగు)-12.45,6.35; విధి (తెలుగు)-4.10, శంకర్‌దాదా ఎంబీబీఎస్ - 10.00